
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
24-11-2025 (Monday) MAIN EDITION

## బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర కన్నుమూత



**అక్షరటుడే, సినిమా డెస్క్:** బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర కన్ను మూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం చనిపోయారు. పది రోజుల క్రితం ముంబైలోని ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఇటీవల డిశ్చార్జ్ అయ్యారు. ఇవాళ మరోసారి ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచారు. ధర్మేంద్రకు కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నాయి. ఆయన మృతితో బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

## రూ.262 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీ భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు, ఢిల్లీ పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్' పేరుతో చేపట్టిన తనిఖీల్లో న్యూఢిల్లీ ఛత్రపుర్‌లోని ఓ ఇంట్లో రూ.262 కోట్ల విలువైన 329 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌సీబీ అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు.

## అర్ధరాత్రి సీపీ సజ్జనార్ పెట్రోలింగ్



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదివారం అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. లంగర్ హౌస్, టోలిచౌకి ప్రాంతాల్లో అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి తనిఖీలు చేశారు. వారి నేర చరిత్ర, జీవనశైలిపై ఆరా తీశారు. నేర ప్రవృత్తి మానుకోవాలని సూచించారు.

## 5వేల మినీ అంగన్వాడీల అప్‌గ్రేడ్




**అక్షరటుడే, అమరావతి:** రాష్ట్రంలో 5వేల మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఏపీ మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 217 మందికి అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. అంగన్‌డీ ఉద్యోగుల జీవితాల్లో ఆనందం నింపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

## తిరుచానూరులో రథోత్సవం



**అక్షరటుడే, తిరుపతి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఎనిమిదో రోజు రథోత్సవం నిర్వహించారు. ఉదయం ధనుర్ లగ్నంలో మొదలైన రథోత్సవం ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు.

## అయ్యప్ప భక్తులకు బ్రెయిన్ ఫీవర్ టెన్షన్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** శబరిమల అయప్ప స్వామి దర్శనానికి భారీగా భక్తులు తరలి వస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు వస్తుండడంతో శబరిమలలో రద్దీ అధికంగా ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం, దేవస్థానం బోర్డు అధికారులు రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టారు. అయితే రద్దీతో ఇబ్బందులు పడుతున్న భక్తులకు కేరళ ప్రభుత్వం మరో షాకింగ్ న్యూస్ చెప్పింది. బ్రెయిన్ ఫీవర్ ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. కేరళలో ఇటీవల బ్రెయిన్ ఫీవర్ కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అయ్యప్ప స్వాములు జాగ్రత్తలు పాటించాలని కేరళ వైద్యారోగ్య శాఖ సూచించింది. స్వాములు స్నానాలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ముక్కులోకి నీరు వెళ్లకుండా చూసుకోవాలని పేర్కొంది.

## ట్రావెల్స్ బస్సులు ఢీ.. ఆరుగురి మృతి

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తెన్‌కాశీ జిల్లాలో సోమవారం ఉదయం రెండు ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. మదురై నుంచి సెంకోట్టైకు వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు, తెన్‌కాశీ నుంచి కోవిల్పట్టి వైపు వెళ్తున్న మరొక బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మరో 35 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది.

**ఆపరేషన్ కగార్ విజయవంతమవుతోంది. నక్సల్స్‌కు వ్యతిరేకంగా భద్రతా బలగాలు చేపట్టిన ఏరివేత కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఫలితంగా మావోయిస్టు ఉద్యమం ముగింపు దశకు చేరింది. వరుస ఎన్‌కౌంటర్లతో పాటు లొంగుబాట్లతో పార్టీకి కోలుకోలేని రీతిలో దెబ్బ తగిలింది. కేంద్ర కమిటీ సభ్యులు సహా వందలాది మంది హతం కావడం, అదే స్థాయిలో లీడర్లు, కేడర్ లొంగిపోవడం, కొత్త రిక్రూట్‌మెంట్లు లేకపోవడంతో దశాబ్దాల చరిత్ర కలిగిన పార్టీ ఇక చరిత్రలో మిగిలి పోయే స్థితికి చేరింది. దీంతో మావోయిస్ట్ పార్టీ సంచలన ప్రకటన చేసింది. తాము ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# ఆయుధాలు వీడేందుకు సిద్ధం..

- మావోయిస్టుల సంచలన ప్రకటన
- ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి
- మూడు రాష్ట్రాల సీఎంలకు లేఖ

మావోయిస్టులు సంచలన ప్రకటన చేశారు. తాము ఆయుధాలు వీడేందుకు సిద్ధమని ప్రకటించారు. కూంబింగ్ ఆపేస్తే తాము ఆయుధ విరమణ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 వరకు తమకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సీఎంలకు లేఖ రాశారు. మూడు రాష్ట్రాల జోనల్ కమిటీ అనంత్ పేరిట లేఖ విడుదల చేశారు. బస్వరాజు ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ పునర్నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించినట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని తెలిపింది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు లేఖలో పేర్కొంది.

### సమష్టిగా నిర్ణయం

ఆయుధాలు వదిలేసే అంశంలో తాము సమష్టి నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం ఇవ్వాలని మావోయిస్టులు కోరారు. ఫిబ్రవరి 15 వరకు సమయం ఇస్తే చర్చించి ఆయుధాలు వీడే కచ్చితమైన తేదీని ప్రకటిస్తామన్నారు. అప్పటి వరకు ప్రభుత్వాలు సెర్చ్ ఆపరేషన్లను ఆపేయాలని విజ్ఞప్తి చేశారు. పీఎల్‌జీఏ వార్షికోత్సవాల నేపథ్యంలో రానున్న రోజుల్లో ఎలాంటి ఆపరేషన్లు చేపట్టొద్దని తాము నిర్ణయించామన్నారు. ఎంఎంసీ జోన్ పరిధిలో తమ కార్యకలాపాలను నిలిపివేస్తామన్నారు. తాము లొంగిపోయే ముందు కొంతమంది ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులతో సమావేశమయ్యే అవకాశం కల్పించాలని మావోలు కోరారు.

### ఆపరేషన్ కగార్‌తో..

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వేల సంఖ్యలో బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. పక్కా సమాచారం కూంబింగ్ చేపడుతూ.. కీలక నేతలను సైతం ఎన్‌కౌంటర్ చేస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. ఇందులో పార్టీ అగ్రనేత, కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజు మేలో మృతి చెందారు. ఇటీవల ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్లలో మాడ్వి హిడ్మా, ఆయన భార్య రాజే, టెక్ శంకర్ చనిపోయారు. ఎన్‌కౌంటర్లలో కీలక నేతలు, కేడర్ చనిపోతుండడంతో చాలా మంది లొంగిపోతున్నారు.

### దశాబ్దాల పోరాటం..

ఒకనాడు దోపిడీ, అణచివేత వంటి వాటికి వ్యతిరేకంగా పుట్టిందే నక్సల్ ఉద్యమం. అణచివేతకు గురవుతున్న అణగారిన వర్గాల కోసం దాదాపు ఐదారు దశాబ్దాల క్రితం నక్సల్బరీ ఉద్యమం పురుడు పోసుకుంది. పశ్చిమబెంగాల్‌లోని నక్సల్‌బరి గ్రామంలో ఆవిర్భవించిన ఈ సాయుధ పోరాటం.. ఆ తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించింది. గ్రామీణ పేదలు, ఆదివాసుల హక్కుల కోసం పోరాటం పేరిట చాలా ప్రాంతాల్లో మావోయిస్టులు సమాంతర పాలనను నడిపించారు. ప్రజల నుంచి బలమైన మద్దతు లభించడం, సానుభూతిపరులు పెరగడంతో విప్లవ పార్టీ కొన్నేళ్ల పాటు ఒక వెలుగు వెలిగింది. అయితే గత కొంతకాలంగా పలుచబడిన ఉద్యమం.. ప్రస్తుతం ఆపరేషన్ కగార్ ధాటికి తుది దశకు చేరింది. మార్చి 31లోపు దేశంలో మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే ఆ లోపే కేంద్రం లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.

## సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. సీజేఐగా బీఆర్ గవాయ్ పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. దీంతో తదుపరి సీజేఐగా ఆయన సూర్యకాంత్ పేరును ప్రతిపాదించారు. దీనికి రాష్ట్రపతి ఆమోదం లభించడంతో సూర్యకాంత్ తాజాగా ప్రమాణం చేశారు. ఆయన 2027 ఫిబ్రవరి 9 వరకు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు ఓఆర్ఆర్ వెలుపలకు.. సర్కారు ఉత్తర్వులు జారీ

**అక్షరటుడే, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ లోపల కాలుష్యకారక, కాలం చెల్లిన పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) బయటకు తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు మొదలెట్టింది. బాలానగర్, జీడిమెట్ల, కాటేదాన్, కూకట్‌పల్లి, ఉప్పల్, చర్లపల్లి తదితర 22 పారిశ్రామిక వాడల్లోని భూములను ఇతర అవసరాలకు వినియోగించేలా కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇందుకోసం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీని (హెచ్‌ఐఎల్‌డీపీ) అమలు చేయనుంది. ఈ మేరకు ఇండస్ట్రీస్, కామర్స్ డిపార్ట్మెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆయా ఇండస్ట్రియల్ ప్రాంతాల్లోని 9,292.53 ఎకరాల భూములను ఇతర అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది.

## భూముల అమ్మకంపై ప్రభుత్వాన్ని నిలదీయండి



**అక్షరటుడే, హైదరాబాద్ :** పార్టీ వెంట ఉన్న ప్రతి కార్పొరేటర్‌కు భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బల్దియా సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోరాడిన తీరుకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. పరిశ్రమలకు కేటాయించిన వాటితో పాటు హైదరాబాద్‌లో భూముల అమ్మకంపై బల్దియా సమావేశంలో నిలదీయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీయాలన్నారు.

## కారులో మంటలు.. డ్రైవర్ సజీవ దహనం..



**అక్షరటుడే, హైదరాబాద్:** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భయానక ఘటన చోటు చేసుకుంది. ఔటర్ రింగ్ రోడ్డుపై కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. శామీర్‌పేట్ నుంచి కీసర దిశగా ప్రయాణిస్తున్న కారు, లియోనియో రెస్టారెంట్ సమీపంలో రింగ్ రోడ్డు పక్కన ఆగి ఉండగా ఈ ప్రమాదం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి, ఏసీ ఆన్ చేసి కారులోనే నిద్రిస్తున్న సమయంలోనే మంటలు చెలరేగినట్టు ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. మంటలు క్షణాల్లోనే కారు మొత్తాన్ని ఆవహించడంతో డ్రైవర్ బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. కారు పూర్తిగా కాలిపోయి బూడిదైంది.

## స్థానిక ఎన్నికలపై హైకోర్టులో విచారణ వాయిదా




**అక్షరటుడే, హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. చీఫ్ జస్టిస్ లేకపోవడంతో ఇవాళ జరగాల్సిన విచారణ రేపటికి వాయిదా వేశారు. స్థానిక ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల అంశంపై సోమవారం విచారణ జరగాల్సి ఉంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వాహణకు ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు కోర్టుకు తెలపనుంది. కోర్టు విచారణ అనంతరం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని భావించింది. అయితే నేడు విచారణ జరగకపోవడంతో మరో రోజు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

## పాక్ పారా మిలిటరీ కార్యాలయంపై ఆత్మహుతి దాడులు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్‌లోని పారా మిలిటరీ ప్రధాన కార్యాలయంపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. ఆత్మహుతి దాడులు చేపట్టడంతో పాటు, కాల్పులు జరిపారు. దీంతో ఆరుగురు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పాక్‌లోని పెషావర్ ఫ్రాంటియర్ కోర్ ప్రధాన కార్యాలయంపై సోమవారం ఉదయం దాడి జరిగింది. రెండు శక్తివంతమైన పేలుళ్లు చోటు చేసుకున్నట్లు పాక్ మీడియా తెలిపింది. అనంతరం ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు పాకిస్థాన్ కమాండర్లు సహా ఆరుగురు చనిపోయారు. ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు అధికారులు గుర్తించారు.




## భారత అమ్ముల పొదిలోకి ఐఎన్ఎస్ మాహే

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** భారత అమ్ముల పొదిలో మరో కీలక అస్త్రం చేరింది. అత్యాధునిక యాంటి సబ్ మెరైన్ వార్ఫేర్ షాలో ఐఎన్ఎస్ మాహే నౌకదళానికి అప్పగించారు. ముంబై నేవల్ డాక్‌యార్డులో దీనిని నేవీకి అందించారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది, వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ హాజరయ్యారు.